# తీరని సమస్య

రచన :
శ్రీ మధిర భానుమూర్తి

సోమేశ్వరరావుగారికి ఈసమస్య ఇవాళే క్రొత్తగా ఉద్భవించిందికాదు. ఎన్నాళ్ళుగానో ఎదుర్కొంటూనే ఉంది. ఎప్పటికప్పుడు మాత్రం వాయిదావేస్తూవచ్చారు అనేక కారణాలవల్ల. రాను రాను దాని రూపం మరింత వికృతమవుతూందేకాని ఏమీ తేలి కవటంలేదు. దానిని గురించి ఆలోచించిన కొద్దీ మతిపోతుందా అనిపిస్తోంది. అంతజటిలంగా తయారవుతుంది నానాటికి. ఇంత విపరీతంగా తనని ఆ సమస్య ఎదురుకుంటుందని తనకి ముందే తెలిసిఉంటే తానసలు దానిని ఇంతకాలంగా వాయిదా వేసేవాడుకాదు. ఏదో ఒకవిధంగా అప్పుడే పరిష్కరించి ఉండేవాడు. ఇవన్నీ ఇవాళ అనిపిస్తున్నాయి గాని ఆనాడు ఏమైనా తోచాయా ?..'ఇది గతజలసేతు బంధనంతప్ప ఇంకేమీకాదు.... ఇకముందు చెయ్యవల సిందేమిటో ఆలోచించుకోవాలిగాని జరిగిపోయినవాటిని ఎన్నిసార్లు స్మరించుకుంటే మాత్రం ప్రయోజనమేమిటి ? ఇదంతా తన అప్రయోజకత్వం వల్ల ఇలా జరిగిందని తన్ను తాను నిందించుకోవటంకూడా కద్దు. ఎవరిని నిందించినప్పటికీ ఏమీ లాభంలేదు.... లాభం లేదని తెలిసి ఉండికూడా నిందించటం మానటంలేదు...ఎందుకో తనకే తెలియదు — వెనకటివి తలపోసుకోవద్దనుకున్నాడు ఎన్నో సార్లు. దానివల్ల లాభంలేదని...అయితేనేం ? తలపోసు కోకుండా ఉండలేకపోతున్నాడు. ఎప్పుడు ఈవిషయాన్ని గురించి ఆలోచించినా వెనకటి విషయాలన్నీ వరసగా గుర్తుకువస్తాయి. జరిగిన పదేళ్ళ సంఘటనలు కళ్ళముందు వచ్చి నుంచుంటాయి. పొమ్మన్నా పోవే !....అవ్వి తన మనోఫలకంమీద అంతగాఢమైన ముద్రవేసుకున్నాయి కాబోలు !

అసలు ఈ సంగతులన్నీ ఇవాళ గుర్తురావటానికి కారణం జానకి పెళ్ళి ప్రసక్తిరావటమే !...ఆ ఐ.ఏ. యస్. చదివిన కుర్రాడు చదువుకోని పల్లెటూరి పిల్లనే తప్ప పెళ్ళాడనంటున్నాడని తెలియడమే !....ఆ అబ్బాయి - కామేశం — ఎం.ఏ. ప్యాసయాడు. ఒక కాలేజీలోజేరాడు. అక్కడే ఉంటూ కష్టపడి చదివి ఐ.ఏ.యస్. పరీక్ష ప్యాసయాడు. సర్కారువారు అతనికి తగిన శిక్షణనిచ్చి ప్రస్తుతం డిప్యూటీ కలక్టరుగావేశారు. మంచి సాంప్రదాయమైన కుటుంబంలోవాడు. రూపవంతుడు. గుణవంతుడు. అన్నిటికన్నా ముఖ్యంగా కట్నంకానుకలమీద అంత ఆశలేదని తెలిసింది. తను తన కూతురినిస్తే బాగుంటుందనుకున్నాడు. ఈడూ జోడూ బాగుంటుంది. పైగా జానకికూడా బి.ఏ. వరకూ చదువుకుందిగనక తప్పకుండా ఆ కుర్రాడు చేసుకుంటాడని ఆశించాడు. ఆ ఆశతోనే పిల్లనిస్తానని వెళ్ళాడు. అయితే తన ఆశ అంతా క్షణంలో మాయమయింది. ఆ అబ్బాయి చదువుకున్న పిల్లని చేసుకోనని, పల్లెటూరి పిల్లనే చేసుకోవాలనుకుంటున్నాననీ చెప్పాడు. కారణం అడిగాడు సోమేశ్వరరావుగారు. పట్నవాసాల్లో ఉండి చదువు సంధ్యల్లో ఉండే పిల్లకి తన షోకులమీద ఉండే శ్రద్ధ పనిపాటలమీద ఉండదని, సాధారణంగా వారిలో చాలమందికి పనిపాటలు చేతకావని తను నమ్మడంచేతనే ఆ నిశ్చయానికి వచ్చినట్టు చెప్పాడు అతను. జానకి బి.ఏ. చదివినప్పటికీ దానికి తగని షోకు లేమీలేవని, పనిపాటలన్నీ చక్కగా చెయ్యగలదని తను ఎంతో నచ్చ చెప్పాడు కుర్రాడికి. ఎంతగా చెప్పినా ఏమీ లాభంలేక పోయింది. పోనీ ఒకసారి వచ్చి పిల్లని చూసుకుని తరువాత ఏమాటా చెప్పమనికూడా బ్రతిమాలాడు. కామేశం 'ససేమిరా !' అన్నాడు. ఒక్కసారిగా కోపం, ఏడుపూకూడా తనను ఆవహించాయి. అవన్నీ దిగ మ్రింగుకుని అతని దగ్గరనుంచి వచ్చేశాడు.

ఆరోజు ఇంట్లో ఎవరితోనూ ఆయన సరిగా మాట్లాడ లేదు. ఎక్కడ ఉన్నా, ఏపని చేస్తున్నా ఒకటే ఆలోచన. ఏ చిన్న విషయాన్ని గురించైనా ఎంతో చిరాకు ప్రదర్శించాడు. ఇంటిల్లపాదిమీదా కోపమే అకారణంగా — అయితే వాళ్ళకందరికి ఈయన ఇలా ఉండటానికి కారణాలు తెలుసును. ఇదివరకెన్నోసార్లు వారు ఆయనను చూశారు. అలాంటి స్థితిలో....అందుచేత వారికిదంతా కొత్తేమీకాదు. కనక ఎవరిమట్టుకు వాళ్ళే తప్పుకుతిరిగారు.

ఆరోజల్లా ఒక కుర్చీలో కూచుని ఆలోచిస్తూఉన్నాడు. ఆ ఆలోచన ఎప్పటికి తెములుతుందో ఆయనకేతెలియదు. ఆ ఆలోచనలోనే వెనకటి సంగతులన్నీ ఆయనకళ్ళ ముందు నిలిచినై. పదేళ్ళ చరిత్ర ఒక్కసారి కళ్ళముందు తిరిగింది.

అది సరిగ్గా పదేళ్ళనాటిమాట. అప్పటికి జానకి పదమూడేళ్ళు. హైస్కూలులో చదువుతోంది. మనమరా

పెళ్ళిచూసి మరీకన్నుమూయాలని ఎంతో అల్లాడేవాడు తన తండ్రి. కాని అప్పట్లో పిల్లకి పెళ్ళిచెయ్యటం తనకి ఇష్టంలేదు. తనకి తెలుసు పెళ్ళయిన మరుక్షణాన్నుంచే పిల్లని చదువు మానిపించాలని. జానకిని చదువు మానిపించడం తప్పనిపించింది తనకి. ఎంతో బాగా చదువుతోంది. ఫస్టుమార్కులన్నీ దానివే. అంతచురుకైన పిల్లని స్కూలుఫైనలేనా అవనిదే చదువు మానిపించకూడదనుకున్నాడు. "ఇంతవరకూ చదివింది చాలు. ఇంకా చదివి ఈవిడ ఊళ్ళేలాలా ?.... ఉద్యోగాలు చెయ్యాలా ?... ఈపాటికి చదువు కట్టిపెట్టించి పిల్లని అయినవాడి చేతులో పెట్టు" అనేది అమ్మ. ఆవిడ ఎప్పుడూ అంతే! ఆడపిల్లలకి చదువు అక్కర్లేదంటుంది. జానకిని బళ్ళో వెయ్యటమే ఆవిడకసలు ఇష్టంలేదు. అంతా పూర్వకాలపుమనిషి. ఆవిడకు ఎవరూ చెప్పలేరు. ఎవరేనా ఆవిడతో వాదించబోతే "మా అమ్మకి చదువుందా ? మా అమ్మమ్మకి చదువుందా?....మా తాతమ్మకి చదువుందా?.... మరి మేమంతా కాపరాలు చెయ్యలేదా ? పిల్లల్ని పెంచలేదా ? మాకు ఈ చదువులు లేకపోతే ఏంలోటయింది?" అని పదితరాల వెనకనించి ఉదాహరణలిస్తుంది. అందుచేత ఆవిడతో వాదించి లాభంలేదు. అది గ్రహించే తను వాదన పెంచుకోలేదు. తననుకున్న ప్రకారం హైస్కూలు చదువు పూర్తయేవరకూ పిల్ల పెళ్ళి ప్రసక్తి ఎవరినీ తేనివ్వలేదు. తన భార్య మాత్రం ఒకటి రెండుసార్లు చెప్పి చూసింది. కాని లాభంలేక ఊరుకుంది. చేసేదేమీలేక.

జానకి జాగ్రత్తగా చదువుకుని స్కూలుఫైనలు పరీక్షకు వెళ్ళింది. బాగానే వ్రాసింది. తనకోరిక తీరింది. ఇక ఆనాటినుండి జానకికి సంబంధాలు వెదకాలని నిశ్చయించాడు. ఎక్కడెక్కడున్న సంబంధాలను గురించి వాకబు చెయ్యటం మొదలుపెట్టాడు. ఆస్తి, పాస్తులు, చదువు సంధ్యలు అన్నీ వాకబుచేస్తున్నాడు. ఇంతలో రెండునెలలయి స్కూలుఫైనలు పరీక్షాఫలితాలుతెలిశాయి. జానకి ప్యాసయింది. అంతేకాదు. వాళ్ళ స్కూలుకి ఫస్టుగావచ్చింది. ఇంట్లో అందరూ ఆనందించారు. జానకికి పాఠాలు చెప్పిన పంతుళ్ళుకూడా ఎంతో గర్వించారు. ఆ స్కూలు హెడ్మాస్టరుగారు జానకినిపైకి చదివించమని సలహాయిచ్చారు. జానకి విషయం తెలిసి ఉన్న చాలమంది ఆసలహా బాగుందన్నారు. అంత తెలివైన పిల్లకి చదువు చెప్పించకపోవటం తప్పన్నారు. అందులోనూ ఆ ఊళ్ళోనే కాలేజీ ఉన్నప్పుడు జానకిని చదివించకపోవటం తనకికూడా అన్యాయంగానే కనిపించింది. అదీకాక ఇంకా ఏ సంబంధం సిద్ధంగాలేదప్పటికి. అందుకని 'పోనీ' అని జానకిని కాలేజీలో జేర్చాడు.

ఆమెను కాలేజీలో జేర్చాడన్న మాటేగాని అనుక్షణం ఆమె వివాహం విషయం తనను వేధించేది. ఒకవేళ ఎప్పుడైనా తను ఆ విషయం మరిచిపోతే తల్లి, తండ్రి, భార్య అందరూ జ్ఞాపకంచేసేవారు. వారంతా తనకి వ్యతిరేకులే. జానకిని కాలేజీలో జేర్పించకూడదంటారువారు. "ఇంట్లో కూచునిమాత్రం ఏంచేస్తుందని జేర్పించాడు తను. ఇది వారికర్థంకాదు....తనుమాత్రం తీవ్రంగానే ప్రయత్నంచేశాడు వరునికోసం. అయితే ఒక విశేషం. ఇదివరకటిలాగ ఏసంబంధంపడితే దానికని ఎగబడటం లేదిప్పుడు. ఇదివరకంటే పిల్ల హైస్కూలులోనే చదువుతుండేది గనక స్కూలుఫైనలు ప్యాసయినవాడినిగురించి కూడా వాకబుచేసేవాడు. కాని ఇప్పుడలాకాదు. పిల్ల ఇంటర్మీడియేట్ చదువుతోంది కనక వరుడు కనీసం గ్రాడ్యుయేటయినా అయిఉండాలి. అంతకు తక్కువవాడిని తనుతెస్తే అమ్మాయి వప్పుకోదు. ఒకవేళ అది మొహమాటపడి చెప్పనప్పటికి తనకిమాత్రంతెలియదూ?- ఇంటర్మీడియేట్ చదివేపిల్లకి ఎలాంటివరుణ్ణి తేవాలో:.... తెలుసు.... తను అన్యాయం చెయ్యడు.

ఇలాగతను వరుణ్ణి ఎన్నుతుంటే తనకి తెలియకుండానే కాలం గడిచిపోయింది. జానకి సీనియరుక్లాసులోకి వచ్చేసింది. పెద్ద పరీక్షలుకూడా దగ్గరకువచ్చాయి. కాలేజీలోకూడా తన పేరు నిలబెట్టుకుంది జానకి. కాలేజీకి ఫస్టువస్తుందనుకుంటున్నారంతా. పరిస్థితు లనుకూలిస్తే యూనివర్సిటీ ఫస్టుకూడా రావచ్చునట. అందుచేత ఆమె చదువుకు ఏవిధమైన అంతరాయం కలగకూడదనుకున్నాడు.

ఇంక ఒక నెలరోజుల్లో పరీక్షలనగా అన్నివిధాలా అనువైన సంబంధం ఒకటి తటస్థపడింది. అన్ని విషయాలు కుదిరినై. కాని మగపెళ్ళివారు వెంటనే పెళ్ళిచేసి పిల్లని చదువు మానిపించమన్నారు. ఇంతవరకూ చదివించినదంతా వృధాఅవుతుందనీ, ఇక ఒక్కమాసమే గనక అనుమతించవలసిందనీ ప్రాధేయపడ్డాడు తను. వాళ్ళు దానికంగీకరించలేదు. పెండ్లి కుమారుడు ఏదో దూరదేశానికి ఉద్యోగంమీద వెడుతున్నాడట. కనక

అతనితో వెంటనే పిల్ల వెళ్ళటానికి వప్పుకుంటేనే అంగీకరిస్తామన్నారు. ఇంతవరకూ పడ్డ శ్రమ ఒక్క నెలలో ఒక రూపానికి వస్తుందనీ, సత్ఫలితాలనిస్తుందనీ ఆశించే సమయంలో జానకి చదువు ఆపడం ఇష్టంలేక ఆ సంబంధం వదులుకోవలసివచ్చింది. తల్లి, తండ్రి, భార్య తనని ఆడిపోసుకున్నారు....ఏమయినాసరే, ఈసగాసి నక్కల పాలుచెయ్యటం తనకిష్టంలేదు. అంతటితో జానకి వివాహం మళ్ళా వాయిదాపడింది.

కాలచక్ర గమనం చాలా చురుకుగాఉంది. జానకి పరీక్షలవడం, ఫలితాలు తెలియడం, ఆమె ఫస్టుక్లాసులో ప్యాసుకావడం....ఇవన్నీ ఒకదాని వెనుక ఒకటి తనకు తెలియకుండానే జరిగిపోయాయి. తన అభీష్టం సిద్ధించింది. తన కూతురు కాలేజీకి ఫసువచ్చింది. సరస్వతీదేవి భూలోకంలో జానకిరూపంలో అవతరించిందన్నారు అంతా. ఆమె సాధించిన విజయానికి అందరూ సంతోషించారు. తమ బంధువుల్లో అంత తెలివైన పిల్ల ఉన్నందుకు గర్వపడ్డారు చుట్టాలంతా. అందరూ ఈ విషయాన్నిగురించే చెప్పుకున్నారు. తనని అభినందించారు ఆపిల్లకి ఉన్న తెలివితేటలకు కావలసిన ప్రోత్సాహమిచ్చి వృద్ధిలోకి తీసుకువచ్చినందుకు. తన తల్లి ఈ మాటలువిని కొడుకుతో అంది. "నాయనా ! ఇంతవరకూ ఏదో జరిగింది. నువ్వు చదువు చెప్పించినందుకు అదీ మాట దక్కించుకుంది....ఇకనైనా ఆలస్యం చెయ్యక పెళ్ళి ప్రయత్నంచెయ్ !" అని. "నేను మాత్రం ప్రయత్నించటం లేమటమ్మా !...మరి కుదరటంలేదు.... నేనేం చెయ్యను చెప్పు ఇంతకంటె !" అన్నాడు భారంగా. ఇంత సంతోషం వెనకా తన గుండెల్లో భారం మాత్రం అలాగేఉంది. ఇప్పుడిక బాగా మంచి మార్కులతో గ్రాడ్యుయేటయి పైచదువుకి వెళ్ళేవాడేనా అయితేనే గాని పిల్లనివ్వటానికి మనస్కరించటంలేదు తనకి. నిజమే మరి. అంత బాగా ఇంటర్మీడియేటు ప్యాసయిన జానకికి తను చేజేతులా ఏథర్డుక్లాసు బి.ఏ.నో తెచ్చికట్టబెట్టగలడా ?....

జానకికి తగిన సంబంధం కోసం తను వెదుకుతూనే ఉన్నాడు. నలుగురినీ అడుగుతున్నాడు. ఎక్కడ సంబంధం ఉందంటే అక్కడికి వెదుతున్నాడు.... ఇంతలో తిరిగి కాలేజీలు తెరిచారు, మళ్ళా మునుపటి సమస్యే వచ్చింది. ఊరికే ఇలా ఇంట్లో కూచోబెట్టుకునేబదులు బి. ఏ. చదివిస్తే !— ఊళ్ళోనే కాలేజీ గనక— ఎప్పుడు సంబంధం కుదిరితే అప్పుడే పెళ్ళి చెయ్యవచ్చు. అంతవరకూ ఇంట్లో ఊరికే కూచోబెడితే కలిసి వచ్చేదేమిటి ? పొరుగూరు పంపవలసివస్తే తను ఎలాగూ పంపడు. ఊళ్ళోనే చదువయినప్పుడేం అభ్యంతరం ఉంటుంది ? దీనికి ఇంట్లో అంతా వ్యతిరేకులే. అయినా ఊళ్ళో అంతా సుముఖులేకాకుండా బాగా ప్రోత్సహించేరుకూడా. జానకి కూడా చదువుకుంటానంది. వెంటనే జేర్పించాడు.

పిల్లని కాలేజీలో జేర్పించాడన్నమాటేగాని తను మాత్రం సంబంధాలకోసం వెదుకుతూనే ఉన్నాడు. ఎంత వెదికినా తనకూతురికి తగిన సంబంధం దొరకటంలేదు. పెద్ద చదువు చదివినవాళ్ళే ఎవరూ కనిపించటంలేదు. ఒకవేళ ఎవరేనా ఉన్నా వాళ్ళకి అంతకుముందే పెళ్ళయి ఉంటూంది. అవివాహితులైన విద్యావంతులు యోగ్యులైనవాళ్ళు ఎంతగా వాకబుచేసినా దొరకటంలేదు.

తను ఒకటి రెండు సంబంధాలు తెచ్చాడు. కాని అవి కుదరలేదు. ఒక సంబంధం విషయంలో కుర్రాడిప్రవర్తన మంచిది కాదని చూచాయిగా తెలిసింది. మరో సంబంధం విషయంలో కుర్రాడి తల్లి గడుగ్గాయనీ కోడళ్ళని యమయాతనలు పెడుతుందనీ విన్నాడు. అదీకాక ఆ యిద్దరు పెళ్ళికొడుకులకీ తగని భేషజం ఉండడంవల్ల జానకికూడా ఏవగించుకుంది వాళ్ళని.

ఇంతలో జానకి సీనియరు క్లాసులోకి వచ్చింది. చదువు కూడా వెనకటిలాగే సాగుతోంది. ఇంట్లో తల్లి, తండ్రి, భార్యల సాధింపు ఎక్కువగానే ఉంది. "పెళ్ళి చెయ్యకుండా దానికి ఈ చదువెందుకు ?" అని. వారినందరినీ అంతగా లెక్కచెయ్యకుండానే కాలక్షేపం చేద్దామంటే వీలా ? అందులోనూ వార్థక్యంవల్ల మంచంపట్టిన తండ్రి తనని పిలిచి "నాయనా ! దానికి మూడు ముళ్ళు పడడం చూసే యోగం నాకు లేదేమిట్రా !" అన్నాడు జాలిగా. ఆయన ఆదుర్దాకొద్దీ తనని అంటాడుగాని తన లోపం ఏముంది ? ప్రయత్నం చెయ్యటంలేమగనకనా ? ఎంత ప్రయత్నించినా ఘటన లేనిదే ఎలా అవుతుంది ?— ఈమాటే తల్లిదగ్గర అంటే ! "ఆఖరికి ఈ వెర్రి వేదాంతంలోకి దిగింది కథ" అంటుంది. ఇంట్లో వాళ్ళ అందరికీ ఒకటే సాకు దొరికింది తనని సాధించటానికి— జానకి ఇంటర్మీడియట్ పరీక్షలముందు వచ్చిన సంబంధం

తను చెయ్యలేదని. మాటికి ముందు దానిని గురించే అంటారు. "చేతులారా ఆ సంబంధం వదిలావు" అని.

వాళ్ళెవరికీ ఆలోచనేలేదు. నిజానికి ఆ సంబంధం అవనందుకు విచారించక్కర్లేదు. పెళ్ళికాకముందే పిల్లని ఒక్కనెల ఆపమంటే కాదన్నవాళ్ళు తరువాత తరువాత పిల్లనసలు పుట్టింటికే పంపమనవచ్చును. అలాంటి పెంకిఘటాలమధ్య జానకి సుఖంగా ఒక్కరోజు కాపరం చెయ్యగలదా ? ఏదేనా ఆపద వచ్చి పిల్లని అనవసరంగా పంపమన్నా వాళ్ళు ఆమాట అనేవారుగా ! తను ఇన్ని ఆలోచించి ఆ సంబంధం వదిలేస్తే వాళ్ళేవేమీ ఆలోచించకుండా తననే తిడుతున్నారు. పోనీ ఇవన్నీ వాళ్ళకి నచ్చ చెబుదామంటే మాట వినరుగా !.... వాళ్ళకి ఎంతతోస్తే అంత. ఇప్పుడు చెయ్యలేదని నలుగురూ నాలుగుమాటలు అంటున్నారుగాని, తను ఆ సంబంధమే చేసి ఉండి, వాళ్ళు పిల్లని అన్ని బాధలూ పెట్టి ఉంటే అప్పుడు ఈ తల్లి, ఈ తండ్రి, ఈ భార్యే తనని దుయ్యబట్టుదురు అన్యాయంగా పిల్లగొంతుకు కోసినందుకు. ఇంతకీ.... తనలోతాను ఇలా సమిలిపోవలసిందేగాని ఎవరున్నారు తను చెప్పుకునేందుకు ? ఎవరు సానుభూతితో వింటారు?

ఇక ఏదో ఒక సంబంధం నిశ్చయం చెయ్యనిదే ఇంట్లో కునుకు పోగూడదనే కృత నిశ్చయంతో బయలు దేరి వెళ్ళాడు. నెలరోజులు విరామంలేకుండా తిరిగాడు. వేళ పట్టున భోజనం, నిద్ర లేకపోవడంచేత తన ఆరోగ్యం పాడయింది. అది గ్రహించినవెంటనే ఇంటికి జేరుకున్నాడు. మంచం పట్టాడు.

ఆ రుగ్మతనించి పూర్తిగా కోలుకోవటానికి రెండు మూడు నెలలు పట్టింది. ఈ లోగా జానకి బి. ఏ. పరీక్ష లయినాయి. అనివార్యంగా జానకికి పెళ్ళి విషయం వాయిదా వెయ్యవలసివచ్చినందుకు చింతించినా, ఈ లోగా జానకి పటభద్రురాలయినందుకు చాల సంతోషించాడు.

జబ్బుపడిలేచినతరువాత తిరిగి సంబంధాలకై తిరగడం మొదలు పెట్టాడు. కాని ఈపని ఇప్పుడు మరీ కష్టంగా ఉంది. బి. ఏ దాకా చదివిన కూతురికి రాబోయే భర్త ఇంకాపైకి చదివిన వాడయితేనేగాని లాభంలేదు. అందు కోసమే ప్రయత్నం చెయ్యసాగాడు. ఆ ప్రయత్నంలోనే కామేశాన్ని గురించి తెలిసింది. అన్నీ బాగున్నాయని పిల్ల నిస్తానని వెళ్ళాడు. అతను పల్లెటూరి పిల్లనిగాని చేసుకో ననటంతో తన ఆశలన్నీ కూలిపోయాయి. ఇక తను జీవితంలో జానకికి పెళ్ళి చెయ్యగలడా అన్న సందేహం కలిగింది. రానురాను ఈ బెంగ ఎక్కువయింది. జానకిని చూసినప్పుడల్లా తనకి వెక్కివెక్కి ఏడవాలనిపిస్తుంది. కాని బేలతనంతో తనే అలా ఏడిస్తే కుర్రపిల్ల అదేం అఘాయిత్యం తలపెడుతుందోనని భయపడి ఆ బాధను దిగమ్రింగుకునేవాడు. తను ఇన్నాళ్ళుగా జానకికై ఖర్చు పెట్టిన సొమ్ము, ఆమె ఎంతో శ్రమపడి చదివి సంపాదించిన ఫస్టుక్లాసు డిగ్రీలు.... ఇవన్నీ వృధా అయిపోయినై. ఇప్పటి పెళ్ళికొడుకు లింతచవటలేమిటి? రత్నంలాంటి పిల్లని—అందులోనూ పట్టభద్రురాలైనదాన్ని—ఇస్తామంటే 'వద్దు' అని జంకుతారు, అని తిట్టుకున్నాడు. జాలిపడ్డాడు. అంతలో అసహ్యంకూడా వేసింది వాళ్ళ తెలివితక్కువకి.

ఇంట్లోవాళ్ళ సొద మరీ ఎక్కువయింది. మేం అప్పుడు చెప్తేవిన్నావా? ఇవాళ అనుభవిస్తున్నావు. అవాళే పెళ్ళి చేస్తే ఎంతబాగుండును? అంటారు. ఆలోచించగా వాళ్ళు చెప్పేది నిజమేమో అనిపిస్తుంది. చిన్న పిల్లగా ఉన్నప్పుడయితే ఎవడికో ఒకడికిచ్చి పెళ్ళిచేసును. అటు పైన దాని అదృష్టమెలా ఉంటే అలాజరుగును .... ఎన్ని అనుకుని ఏంలాభం?.... చేతులు కాలిపోయాయి .... ఎన్ని ఆకులు పట్టుకుంటే మాత్రం ఏముంది?....

ఇలా తనని తను సమాధాన పర్చుకున్నా లోపల దిగులుమాత్రం ఎక్కువగానే ఉంది—జానకిజీవితం ఎటూ గాకుండా పోతుందేమోనని ... ఇలా ఉండగా ఊళ్ళో హైస్కూలులో ఒక ఖాళీ వచ్చింది. జానకిని ఆ ఉద్యోగానికి రమ్మని పిలిచారు. "ప్రస్తుతానికి ఏదోఒకటి-చేరు" అన్నాడు తను. "నాయనా : ఆఖరికి ఉద్యోగాలు కూడా చేయిస్తున్నావు. అయినా మా మాటలు మీ కెందుకు పనికొస్తాయిరా !'' అని తల్లి అక్కసును వెళ్ళ బుచ్చుకుంది. ''ఇంతకీ ఇది నాఖర్మం !'' అని శ్రుతి కలిపింది భార్య.

జానకి ఉద్యోగంలో జేరింది. అది విన్న వారంతా సంతోషించారు జానకంత తెలివయిన పిల్ల ఆ స్కూల్లో మేష్టరయినందుకు. కాని సోమేశ్వరరావుగారి హృదయం మాత్రం బరువుగానే ఉంది. జానకి ఇంటికివచ్చి ''ఇవాళ ఉద్యోగంలో జేరాను నాన్నా !'' అని చెప్తే ఆయనరెండు కన్నీటి చుక్కలు రాల్చాడు అది సంతోషమో విచారమో తెలియదుగాని. లోకం దృష్టిలో ఆయన అదృష్టవంతుడు-జానకికి తండ్రి అయినందుకు. ఆయనకు మాత్రం ఒక్క సమస్యాతీరకుండా అలాగే ప్రళయతాండవం చేస్తున్నాయి కళ్ళముందు.